



# దేవదేవుని సేవలో డా.తుమ్మల యుగంధర్

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఖమ్మం పట్టణంలో నాలుగు శతాబ్దాలుగా కోరిన కోర్కెలు తీర్చే దేవదేవుడిగా స్వయంభూగా కొలువుదీరి ఉన్న శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్తానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన శ్రీలక్ష్మీనరసింహా స్వామి గిరి ప్రదర్శన స్థానికంగా ఆధ్యాత్మిక శోభను మరింత పెంచింది. సరిగ్గా ఖమ్మం నగరానికి మధ్యలో కొలువై ఉన్న ఈ దివ్య క్షేత్రంలో లోక కల్యాణార్థం స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ప్రతీ మాసానికి ఓ మారు ఇలా గిరి ప్రదర్శన నిర్వహించడం దేవాలయ ఆనవాయితీగా వస్తోంది. కాగా గిరి ప్రదర్శనకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు డా.తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంభూ శ్రీ లక్ష్మీనారసింహుని పల్లకీని మోసి దేవదేవుని సేవలో తరించారు. దేవాలయానికి చెందిన ఈఓ కొత్తూరి జగన్ మోహన్‌రావుతో పాటు ఆలయ అర్చకులు డా.తుమ్మల యుగంధర్‌కు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్తంభాద్రి గుట్టపై గిరిప్రదర్శన నిర్వహించారు.



**చారిత్రక ఆలయం శ్రీలక్ష్మీనారసింహుని దివ్యక్షేత్రం..**

చారిత్రక ఖమ్మం నగరానికి ఈ పేరు రావడానికి 'స్థంభ శిఖరి' లేదా 'స్తంభాద్రి' అని పిలువబడిన నరసిమాపద్రి గుడి పేరిట ఖమ్మం నగరం పేరు ఏర్పడిందనేది చారిత్రక అంశాలు వెల్లడిస్తున్నాయి. విష్ణుమూర్తి అవతారం నరసింహ స్వామి దేవాలయం ఇది. సుమారు 1.6 మిలియన్ ఏళ్ళనాటి త్రేతా యుగం నుంచి ఈ నగరం ఉండేదని చారిత్రక ఆనవాళ్లతో రుజువైంది. ఈ గుడి ఒక కొండ శిఖరం పై ఉండగా కొండ కింద నిలువుగా వున్న రాయి స్థంభంలాగా పని చేసేది... ఈ స్థంభం లేదా 'ఖంబా' అనే పదం నుంచి ఈ ఊరి పేరు వివిద పేర్లు మారుతూ చివరికి ఖమ్మం అనే పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. స్థల పురాణం విషయానికి వస్తే...పూర్వం మౌద్గల మహర్షి ఈ స్థంభాద్రి ప్రాంతంలో శ్రీ హరి గురించి తపస్సు చేశారు. శ్రీహరి లక్ష్మీసమేత నరసింహుడిగా ప్రత్యక్షమయాడు. శ్రీ హరి ముని కోరిక మేరకు ఇక్కడే భక్తుల దర్శనార్థం ఒక గుహలో కొలువు తీరాడని స్థల పురాణం చెబుతోంది. ఖమ్మం కోట నిర్మాణ సమయంలో కాకతీయ చక్రవర్తి స్వామివారికి ఆలయం నిర్మించాడని చరిత్ర చెబుతోంది. ఆలయ విశిష్టతను తరచిచూస్తే...కొండను తొలచి చేసిన స్థంభాలపై చెక్కిన కాకతీయుల శిల్ప కళాశైలి చూపరులను అబ్బుర పరుస్తుంది. రాతితో నిర్మించిన ఏకశిలా ధ్వజస్థంభం ఇక్కడి ప్రత్యేకత. మరో విశేషమేమంటే స్వామి వారు దక్షిణాభిముఖంగా ఉండటం ఇక్కడ విశేషం.. గర్భగుడిలో స్వామి వారికి ఎడమవైపున లక్ష్మీదేవి, కుడివైపున అద్దాల మండపం ఉంటాయి. ధ్వజ స్థంబం పక్కనే ఆంజనేయ స్వామి మందిరం, గుట్టపై సుబ్రమణ్యస్వామి, విష్ణుమూర్తి, ఆంజనేయ మందిరం, శ్రీవేంకటేశ్వరాలయం ఉన్నాయి. ఇక్కడున్న స్వామివారి కోనేరులో నీరు అన్ని వేళలా ఉంటుంది. వర్షాకాలంలో నీరు ఎక్కువై ఆలయంలోని స్వామి వారి నాభి వరకు నీరు చేరుతుంది. ఆ సందర్భంలో ఆ నీటిని బయటకు పంపుతారు. ఈ ఆలయంలోని నల్లరాతిలో చెక్కిన సాయిబాబా విగ్రహము ఉంది. ఇలా ఉన్న ఆలయం మన రాష్ట్రంలో ఇదొక్కటే నని చెపుతారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన శ్రీలక్ష్మీ నరసింహుని ఆలయ గిరి ప్రదర్శనలో డా.తుమ్మల యుగంధర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరహరి నరసింహా చార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, భక్త మండలి సభ్యులు ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు కుక్కల మహేష్, తదితరులు పాల్గొన్నారు.